క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



దాత కాశీ విశ్వనాథంకి బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింహరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి శుక్రవారం అడవివరానికి చెందిన కొరెడ్డి కాశీవిశ్వనాథం అనే దాత లక్ష 116 రూపాయిలు విరాళం అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నదాన భవనంలో ఏఈవో నరసింహరాజు బాండ్ ఇచ్చారు. కార్యక్రమంలో అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ నరసింగరావు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం



నేత్రాలను దానం చేసిన అప్పన్న (ఫైల్)

పద్మనాభం: మండలంలోని శేరిఖండం గ్రామానికి చెందిన పుప్పాల అప్పన్న బాబు (83) మరణాంతరం తన నేత్రాలను దానం చేశారు. తాను మరణించిన తర్వాత నేత్రాలను దానం చేయాలని ఆయన కుటుంబ సభ్యులకు చెప్పాడు. గురువారం అప్పన్న బాబు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఐ బ్యాంకుకు సమాచారం ఇచ్చారు. విశాఖపట్నం ఎల్వీప్రసాద్ ఐ బ్యాంకు వారు గురవారం రాత్రి శేరిఖండం వచ్చి నేత్రాలను తీసుకువెళ్లారు. మృతుడు అప్పన్నబాబుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

12న మాధవుడికి చందనోత్సవం



కుంతీ మాధవ స్వామి విగ్రహం

పద్మనాభం: పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామికి ఈ నెల 12వ తేదీన చందనోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. చందనోత్సవం గతంలో ఎప్పుడూ నిర్వహించలేదు. ఈ ఏడాది నుంచి చందనోత్సవం నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఆరోజు ఉదయం 5 గంటల నుంచి కుంతీ మాధవ స్వామి చందన అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. భక్తులు స్వామి వారి కరుణాకటాక్షాలు పొందాలని ఆలయ కమిటీ కోరింది.

ఘనంగా రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం



పతాకాన్ని ఎగురవేస్తున్న ఫాదర్ సరసా ప్రతాప్

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చిలో శుక్రవారం పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం, క్రీస్తు రక్షకుని యాత్రా ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ఫాదర్ సరసా ప్రతాప్ పతాకావిష్కరణ చేశారు. జపమాల, దివ్యబలి పూజలు నిర్వహించారు. అనంతరం నవదిన ప్రార్థనలు ప్రారంభించారు. స్వస్థత ప్రార్థన కూటమి ప్రార్థనలు చేశారు. పుర:ప్రదక్షిణ, బైబిల్ పదకేళి పోటీలు నిర్వహించారు. 9 రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో విజేతలకు మే 14న బహుమతి ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో రక్షణగిరి పత్రిక సంపాదకులు ఆదిరెడ్డి ఆల్బర్ట్, పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) సభ్యులు ఆమర్, ఆదిరెడ్డి చార్లీ, ఆనందరావు, బేతా రాణి జోసెఫ్, గురు మండలి సలహా సంఘం సభ్యులు, క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- 93వ వార్డులో రూ.1.29 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన చేస్తున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 93వ వార్డు పరిధిలో కోటి 29 లక్షల 87వేల రూపాయిలతో చేపట్టనున్న పది అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రెండులక్షల కోట్లుపైగా నగదు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమన్నారు. పేదలందరికీ సొంతిళ్లు ఉండాలనే లక్ష్యంతో 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమం చేపట్టి రాష్ట్ర చరిత్రను తిరగరాశారన్నారు. ఒక పక్క సంక్షేమంలో దూసుకుపోతూనే మరోపక్క అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని మాట్లాడినా తాము పట్టించుకోమన్నారు. కేవలం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తామన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఎనిమిదో జోన్ జెడ్సీ మల్లయ్యనాయుడు, ఈఈ సంతోషి, ఏఈ రాజశేఖర్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవిరాజు, 93వవార్డు కార్పరేటర్ రాపర్తి కన్నా, 93వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి రాజు, 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, పార్టీ నాయకులు బండి సత్తిబాబు, అడ్డాల రామరాజు, వినోద్, శ్రీకాంత్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

93వ వార్డులో శంకు స్థాపన చేసిన అభివృద్ధి పనులు

- శ్రీనివాసనగర్‌లో రూ. 9.30 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణం
- శ్రీనివాసనగర్‌లో గెడ్డ వద్ద రూ.19.90లక్షలతో డ్రైన్ నిర్మాణం
- శ్రీనివాసనగర్‌లోని రజకవీధిలో రూ. 7.62 లక్షలతో సీసీ డ్రైన్లు
- ప్రహ్లాదపురం,చందనపురికాలనీలో రూ. 9.75లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు
- విరాట్‌నగర్ సమీపంలోని లంకనగర్‌లో రూ. 8.73 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు
- గొల్లనారాయణపురంలోని నూకాలమ్మ ఆలయం వద్ద రూ.9.22లక్షలతో డ్రైన్, సీసీ రోడ్డు, డ్రైన్లతో పాటు ప్రీకాస్ట్ స్లాబ్ నిర్మాణం.
- సాయిమాధవనగర్‌లో సాయిబాబా ఆలయం వద్ద రూ.18.90 లక్షలతో సీసీరోడ్డు
- బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి భరత్‌నగర్ వెళ్లే మార్గంలో సాయిమాధవ్‌నగర్ వద్ద రూ. 18.50 లక్షలతో బీటీరోడ్డు పనులు
- బాలాజీనగర్‌లో రూ.9.25 లక్షలతో బీటీరోడ్డు
- దుర్గానగర్‌లో రూ.18.70 లక్షలతో రిటైనింగ్‌వాల్ నిర్మాణం

రోడ్డు ఇలా.. రాకపోకలెలా?



సోమినాయుడుపాలెం వద్ద బీటలు వారిన రహదారి



వెన్నలపాలెం యూ టర్న్ వద్ద ..

- ధ్వంసమైన సోమినాయుడుపాలెం, వెన్నలపాలెం రోడ్డు

పరవాడ: వాడచీపురుపల్లి– సోమినాయుడుపాలెం రహదారి అధ్వానంగా మారింది. భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసమైంది. దీంతో పలు గ్రామాల ప్రజలు, కార్మికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

వాడచీపురుపల్లి రహదారిలో వై కూడలి నుంచి సోమినాయుడుపాలెం వరకు సుమారు రెండు కిలో మీటర్ల నిడివిలో రహదారి పూర్తి స్థాయిలో ధ్వంసమైంది.రోడ్డు పొడవునా గుంతలు ఉండడంతో హిందూజా, ఎన్టీపీసీ తదితర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, వెన్నలపాలెం, సోమినాయుడుపాలెం, స్వయంభూవరం, కలపాక గ్రామాలకు చెందిన ప్రజలు రహదారిలో రాకపోకలు సాగించడానికి నానా ప్రయాసలు పడుతున్నారు. సోమినాయుడుపాలెం వద్ద బీటలు వారిన రహదారితో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహన చక్రాలు రోడ్డు బీటల్లో చిక్కుకొని పల్టీలు కొడుతున్నారు. రహదారిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయని కారణంగా చీకటి పడితే రోడ్డులో ప్రయాణించడం గగనమవుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. రహదారిలో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా రోడ్డు దెబ్బతిన్నా పట్టించుకునే నాధుడు కనిపించడం లేదని వాపోతున్నారు. కనీసం రోడ్డులో ఏర్పడుతున్న పెద్ద గుంతలు పూడ్చడానికి చర్యలు చేపట్టిన దాఖలాలు లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నామని గ్రామీణ ప్రజలు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల అవస్థలు గుర్తించి అధ్వానంగా మారిన రహదారికి మరమ్మతులు చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అప్పన్నను దర్శించుకున్న మేయర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న హరివెంకటకుమారి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని శుక్రవారం నగర మేయర్‌గొలగాని హరి వెంకట కుమారి దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

బాబోయ్ ఎండ

పరవాడ: రెండు రోజుల పాటు కురిసిన వర్షానికి ప్రజలు కొంత ఉపశమనం పొందారు. కాగా భానుడు శుక్రవారం ప్రతాపం చూపడంతో ప్రజలు అల్లాడి పోయారు. సాయంత్రం 4 గంటల వరకు రోడ్లపై జనసంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. మే నెలంతా ఎండలు విపరీతంగా మండే అవకాశాలు ఉన్నాయని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

డ్రైవర్లకు న్యాయం చేయాలి



జేసీ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

మహారాణిపేట : కార్మికుల (డ్రైవర్లు)కు న్యాయం చేయాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి వెంకటరెడ్డి కోరారు. శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వెంటనే రూ.18,500 చెల్లించాలని జీవీఎంసీ, కాంట్రాక్టర్‌కు ఉత్తర్వులు ఇప్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు పాల్గొన్నారు.

రూ.18,500 వేతనం చెల్లించాలి

అల్లిపురం: క్లాప్ డ్రైవర్లకు లేబర్ కమిషనర్ ఆదేశాల మేరకు రూ.18,500 వేతనం అమలు చేయాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, ఉపాధ్యక్షుడు సీరపు రమణ, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద క్లాప్ డ్రైవర్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పెంచిన వేతనం అమలు చేయడంతో పాటు జీవీఎంసీ పాలకవర్గ కౌన్సిల్ అజెండాగా పెట్టి ఆమోదించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల ఈ నెల 10 తర్వాత నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మహిళలకు ప్రభుత్వకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు అర్హులైనవారందరికీ సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 97వవార్డు 505 సచివాలయం పరిధిలోని చాణిక్యనగర్‌లో ఎమ్మెల్యే శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పైడిరాజు, సన్యాసిరావు, అప్పలరాజు, రఘు, సూరిబాబు, మాధవి, వాటర్ సప్లై ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన బల్లిగిరి వెంకన్న తిరు కల్యాణోత్సవాలు



సహస్ర ఘటాభిషేకంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. గత నెల 30న కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం అష్టోత్తర శత కలశస్నపనం, తిరుమంజనసేవ, వసంతోత్సవం, చక్రతీర్థం నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఘటాలలో నీటితో మూల విరాట్టుకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవాలు ముగింపు సందర్భంగా చక్రస్నానం భక్తి శ్రద్ధలతో చేపట్టారు. సాయంత్రం ధ్వజావరోహణం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణంతో బల్లిగిరి మార్మోగింది. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, ఆలయ ఈవో జీవీ రమాబాయ్, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ, నక్షత్ర హారతి, సప్త హారతులు నిర్వహించారు.

నేడు పుష్పయాగం..

కల్యాణోత్సవాల్లో భాగంగా శనివరం సాయంత్రం పుష్పయాగం ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో రమాబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఊంజల్ సేవ అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తరించాలని ఆమె కోరారు.

విస్తృతంగా ధార్మిక కార్యక్రమాలు



సమావేశంలో పాల్గొన్న ఫౌండేషన్ సభ్యులు

పరవాడ: ప్రతీ దేవాలయం కేంద్రంగా సామూహిక హారతి నిర్వహించడానికి భక్తులు ముందుకు రావాలని సమరసత సేవా ఫౌండేషన్ పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు కోరారు. పరవాడలో శుక్రవారం ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు ఆలయాలకు చేరుకొని సామూహిక హారతి సమర్పించాలన్నారు. అదేవిధంగా వారం వారం భజన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఏకాదశి రోజు గ్రామ ప్రజలు నగర సంకీర్తన నిర్వహించాలని సూచించారు. నెలలో ఒక పర్యాయం హనుమాన్ చాలీసా నిర్వహించి మే 10 నుంచి 25 వరకు ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహించాలని ఫౌండేషన్ నిర్ణయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో కరపత్రాలు, స్టిక్కర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాతృమూర్తులు రెడ్డి రమణమ్మ, పైల సరోజిని, పార్వతి, నూకాలమ్మ, ధార్మిక జట్టు సభ్యులు పైల పోతినాయుడు, సీతారామ్, జె.నాగేశ్వరరావు, సారధి, వి.సూరిబాబు, పి.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి

- టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మండల అధికారులు

సబ్బవరం: స్పందనకు ప్రజల నుంచి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టానొెట్టి మండల అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రవి పట్టానొెట్టి శుక్రవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మండల అధికారులు తహసీల్దార్ కార్యాలయం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖలవారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలన్నారు. సమస్య ఆధారంగా ఆయా గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను తెలుసుకోవాలని సూచించారు. సమస్య పరిష్కరించదగినదైతే వెంటనే పరిష్కరించాలని, లేకపోతే కారణం అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. స్పందన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రంగనాథం, ఎస్ఐ ఎల్. సురేష్, ఆర్ఐ వీరయ్యతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



ఎస్పీకి మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ

సింహాచలం: అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణను శుక్రవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనకాపల్లిలోని ఎస్పీ కార్యాలయంలో ఆయన్ను కలిసిన ఎమ్మెల్యే మొక్క అందజేశారు. అలాగే రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఘనంగా కార్ల్‌మార్క్స్ జయంతి



కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం: ఆర్థిక శాస్త్రవేత్త, శాస్త్రీయ కమ్యూనిజం ప్రతిపాదితుడు కార్ల్‌మార్క్స్ అని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి కొనియాడారు. కార్ల్‌మార్క్స్ 205వ జయంతి సందర్భంగా శుక్రవారం సాయంత్రం సీపీఐ కార్యాలయంలో ఆయన కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పించారు. మానవ జాతి చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్ర అని ఆనాడే విశ్లేషణ చేసిన గొప్ప సిద్ధాంతకర్త అని, కమ్యూనిస్టు ప్రణాళిక తయారు చేసిన మహనీయుడు, పెట్టుబడి గ్రంథం రచయిత, ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని సందేశం ఇచ్చిన గొప్ప తాత్వికుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, బీసీహెచ్ మసేను, ఎ.విమల, ఎస్‌కే రెహమాన్, కసిరెడ్డి సత్యనారాయణ, జి.రాంబాబు, జీఎస్ అచ్యుతరావు, జి.కాసులరెడ్డి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.